తొలి ఆదర్శాలు:
నా చిన్నతనపు అమాయకపు దినాలు గడచిన తర్వాత నాలో నిజమైన ఆత్మీయ పోరాటము మొదలైనది. నా ఆనందకరమైన బాల్యదినాలలో పాపము అంటె ఏమిటో నాకు తెలియదు. నాలో చెడు తలంపులు ఉన్నప్పటికీ, నేను అయోగ్య కరమైన పనులు చేసినప్పటికీ, నేను వాటి గురించి పట్టించుకోలేదు. దేవుడు ఉన్నాడు అని నేను అనుకొనినప్పుడు, ప్రతి చిన్న బిడ్డ పాపరహితుడు కాబట్టి దేవుని చూడగలడని నాకు చెప్పబడినప్పుడు, నేను విన్నటువంటి ఋషులలాగ ఎదో ఒక దినమున అరణ్యములోనికి ధ్యానము కొరకు వెళ్ళి ఆయనను ముఖా ముఖిగా చూడగలనని అనుకొన్నాను. చింతలులేని బాల్యదినములందు నేను నీలికొండలయందు, వెండివాగులయందు, పక్షుల కిలకిలరావాలయందు మరియు ప్రకృతిలోని పుష్పాలయందు అందమును చూచితిని. ఉన్నిలాంటి మేఘాలు కలిగి వంపు తిరిగిన ఆకాశము, దినమున ప్రకాశించే సూర్యుడు, రాత్రి యందు ప్రకాశించే చంద్రుడు మరియు తళతళ మెరిసే నక్షత్రాలు నా మనస్సునకెంతో ఆహ్లాదకరముగా ఉండేవి. ఆటలయందు. స్నేహమునందు, ఆహారము మరియు వస్త్రములయందు ఎందో ఆనందించెడివాడను. కాని ఆ క్షేమకరమైన అమాయకపు బాల్యదశ దాటిన తర్వాతనే నాలో నిజమైన ఆత్మీయ పోరాటము ప్రారంభమయ్యెను.

నేను ఒక తాజాగా వికసించే పుష్పమువలెనుండి, నా తెలివితేటలద్వారా ఈ దౌర్భాగ్యపు లోకమువలన అభ్యంతర పరచబడక నేను ఆశించిన ఏ పనినైనను చేయగలననుకొంటిని. కాని ఈ పుష్పము పాపమనే గాలిచేత కొట్టబడి ఎండి పోవునని ఎప్పుడునూ తెలిసికొనలేదు. దివ్యమైన ఆదర్శాల ప్రకారము, నా దేశ ప్రజలకు సాంఘిక సేవ చేయుటకు నేనొక గొప్ప రచయితనో లేక ఒక గొప్ప ఉద్యోగస్థుడనో కావలెనని అనుకొనేవాడిని. ఈ విధముగా నా జీవితాశయము ఈ లోక సంబంధమైనది. నేను మాధ్యమిక పాఠశాలయందు ఉండినప్పుడు, అంతర-మాధ్యమిక పాఠశాల వివాద పోటీలలో పాల్గొనె గుంపులో ఒక సభ్యునిగా ఎన్నుకొనబడితిని. వివాదాంశము: " జాతిమతాలలోని విభేధాలు దేశ శ్రేస్సుకు

హానికరములు".  నేను నా ఉపాధ్యాయునిచేత ఆదేశించబడినవాడనై, ఒక హైందవుడు, మహమ్మదీయుడు మరియు క్రైస్తవుడు వారి మత గ్రంధాలలోని సిద్ధాంతములను ఖచ్చితముగా పాటించినచో, ప్రశాంతకరమైన మరియు ప్రేమాపూరితమైన జీవితాలను జీవించగలరని ఆ వివాదములో చెప్పితిని. దేవుడు అంతటను, అన్నిటియందునూ ఉన్నాడని, క్రీస్తు గొప్ప మత ప్రబోధకులలో ఒకడని నేను తలంచితిని. కావున నేను బైబిలును, రామాయణమును మరియు ఖురానును చదివి ఆలయాలలోని విగ్రహాలకు మ్రొక్కేవాడిని. చరిత్రలో నాకు ఆసక్తిని కల్గించిన పాఠములు బుద్ధుడు మరియు జైనునివే. నేను పెరిగేకొలది తెలివిగా అబద్ధమును చెప్పుటకునూ, నేర్పుతో దొంగతనము చేయుటకునూ నేర్చుకొంటిని; మరియు పరిహాసమును ఆనందించుటకొరకు అమ్మాయిలను పేర్లుపెట్టి పిలుచుటలో నా చమత్కారశక్తిని ప్రదర్శించుకొనేవాడిని. నేను చేయుచున్న అనేక పనులు మంచివి కావని, ఘనమైనవి కావని, దివ్యమైనవి కావని నేను  తెలిసికొన్నప్పుడు నా హృదయములో అలజడి ఆరంభమైనది. నా అంతరాత్మ నన్ను గ్రుచ్చినప్పుడు నేను పుస్తకములనుండి గ్రహించిన సిద్ధాంతములు మరియు నైతిక విలువలు చాల అసహ్యాకరముగానుండినవి. నేను శాంతి సమధానములు పొందుటకు అప్పుడప్పుడు సినిమాలకు వెళ్ళి, గ్రామఫోన్ పాటలు విని, నా స్నేహితులతో అనవసరమైన విషయాలు మాట్లాడుటలో సమయమును వృథాచేసియుంటిని. నాలో నిరంతరము తప్పులు కనుగొనే ఆ మెల్లనైన స్వరాన్ని అణచివేయ దలచితిని; కాని నేను నా స్నేహితులనుండి మరియు సినిమా హాలునుండి ఇంటికి మరింత ఆందోళనకరమైన దౌర్భాగ్యస్థితిలో తిరిగి వచ్చుచుంటిని.

నన్ను నేను రక్షించుకొనుటకు యత్నించుట:
స్వామి వివేకానంద, స్వామి రామతీర్థ మరియు రామకృష్ణ పరమహంస నైతిక సంభాషణలను కలసి చదువుకొనుటకు నాతో కూడ ఒక నమ్మకమైన బ్రాహ్మణ స్నేహితుడు ఉండేవాడు. జ్ఞానమార్గము, భక్తి మార్గము, కర్మ మార్గము అనే అనేకమైన మార్గములగుండా దేవుని చూడగలమని చెప్పిరి. అనేక మతములు మనలను దేవుని యొద్దకు చేర్చగలవని పెద్దలు హెచ్చరించిరి. మాకు ఇది చాల వివేకముగలదిగా తోచినది. పరీక్షలో నేను మొదటి శ్రేణిని పొందుటకు చాల

కష్టపడవలసివచ్చినది. అదే విధముగా, లోకములో అన్నిటికంటె గొప్పదైన రక్షణను పొందుటకు నేను అన్నిటికంటె ఎక్కువగా కష్టపడవలసివచ్చింది. తత్త్వం అసి (నీవే దైవము), మరియు మనలో గుప్తముగా ఉండే దివ్యజ్ఞానము, యోగా భ్యాసమువలన ఉత్తేజపరచబడి, మన శరీరములను తేజోవంతముగా ప్రకాశించు నట్లు మార్చబడగలదు అనే సిద్ధాంతమును మేము నమ్మితిమి. నేనును, నా స్నేహితుడునూ అనేక మతసిద్ధాంతాలకు నిలయమైన ఆసియా ఖండములోనే క్రీస్తు జన్మించినాడని తెలిసికొనుటకు ఎంతో గర్వపడ్డాము. నా లోకజ్ఞానమువలన క్రీస్తుకూడ తత్త్వం అసి వలన దివ్యజ్ఞానము పొందిన ప్రవక్తలలో ఒకడని అనుకునేవాడిని. క్రీస్తు జీవితము ఎందుకు ముప్పై సంవత్సరములవరకు ఖాళీగా యుండినది? అని ఆలోచించుటకు ప్రారంభించితిమి. ఆయన బోధించుటకు ముందు తప్పక భారతదేశమునకు వచ్చి మన ఋషులతో కలసి తపస్సు చేసియుండవచ్చును. నేనును నా బ్రాహ్మణ స్నేహితుడునూ ఆసనములు (యోగాసనాలు) మరియు ప్రణయామ (శ్వాసవ్యాయామము) సాధన చేయుటకు ప్రారంభించితిమి. ఆత్మనిగ్రహము మరియు ఏకాగ్రతను పొందుటకు మేము ఒక గదిలోనికి వెళ్ళి తలుపువేసికొని, ముక్కుకొనమీద లేక ఒక విగ్రహము మీద మా దృష్టిని కేద్రీకరించెడివారము - ఆయన హిందూ దేవతమీద, నేను క్రీస్తుమీద. యోగా విధుల ప్రకారము నేను శాకాహారిగాను, మసాలాలు మరియు ఉల్లిపాయ లను భుజింపకుండ అప్పుడప్పుడు నా శరీరము కృశించేటట్లు ఉపవాసము చేయుచుండెడివాడను. ఎందుకంటె శరీరము నీరసించినట్లయితె కామముతో కూడిన ఆలోచనలు పారద్రోలబడునని అనుకొనెడివాడను. నా స్వంత కృషి వలన నీతిమంతునిగా ఉండుటకు ప్రయత్నించితిని. దాతృత్వము కలిగియుండుటకై నిరాకరించే స్వభావము సహజంగ నా హృదయములో ఉన్నందున ఆ స్వభావముతో పోరాడవలసి వచ్చినప్పటికిని, నేను పేద ప్రజలకు మరియు బిచ్చగాళ్ళకు ఆహారము, వస్త్రములు మరియు డబ్బును ఇచ్చుచుండెడివాడను. నా స్నేహితుడు తన కళాశాలలో మొదటి సంవత్సరము ముగించుకొని ఒక సన్యాసుల మఠంలో చేరుటకు బెనారస్ వెళ్ళెను. యోగా పన్నెండు సంవత్స రములు చేసిన తర్వాత ఆయనకు అదృష్టముంటే అతని మనస్సులో ఒక వెలుగు రేఖ చూస్తాడు, అదే రక్షణకు గుర్తు అని ఆ మఠము వారు అతనికి చెప్పారు. అదృష్టము అతని పక్షమున లేనిచో, పన్నెండు సంవత్సరాల యోగాభ్యాస

తపస్సు చేసిననూ అతనికి రక్షణ దొరుకుతుందనే నమ్మకము లేదని ఆ మఠానికి చెందిన నాయకుడు కూడ అతనికి చెప్పాడు. తన ఆరోగ్యమును పాడుచేసికొని భయపడి ఇంటికి తిరగి వచ్చాడు. మేము మా జీవితాశయమును నెరవేర్చుకొనవలెనని ప్రయాసపడుచున్న సమయాన నా తండ్రి ఈ విధముగా చెప్పుచుండెడివాడు, " క్రీస్తునందు విశ్వాసము ద్వారానే నీవు రక్షణ పొందగలవు. ఇది దేవుని వరమైయున్నది." నేను అత్యాగ్రహమున నా తండ్రితో ఈ విధముగా వాదించుచుంటిని, " క్రైస్తవులను చూడు, ఎంత భ్రష్టమైన జీవితాలు జీవిస్తున్నారో. వారు హిందువులకన్నా, మహమ్మదీయులకన్నా మిన్నగా ఉన్నారా? మంచిగ ఉండాలంటే అందరు కష్టపడాల్సిందే". " నా తండ్రి ముసలివాడు. ఆయన ప్రార్థించుటకు మోకాళ్ళమీద వంగలేడు. కఠినమైన జీవితమును తప్పించుకొనుటకు క్రైస్తవులు ఎప్పుడు ఈ విధంగా వాదిస్తారు" అని అనుకొనెవాడిని.

ఓటమి మరియు నిరాశ:

కఠినంగా జీవించుట ద్వారా నా పాపములు క్షమించబడినవని నాకు నిశ్చయత కలిగినది. కొన్నిసార్లు నేను నా స్వంత కృషివలన మంచిగ ఉండినప్పుడు అది నాలోని గర్వమును, బడాయిని పెంచేది. నా తలంపులలో అభివృద్ధి లేదు. నా తలిదండ్రులు నన్ను ప్రేమించిరి మరియు నా సహోదరీలు నన్ను చూచి గర్వించేవారు; నా సహోదరులు నన్ను ఇష్టపడ్డారు. నా స్నేహితులు నన్ను గౌరవించారు. నేను ఒక దివ్య ఆశయమును పెట్టుకొని దేవుని కొరకు వెదకుచున్నాను. ఈ విషయములన్నియూ నిజముగా నన్ను ఆదరించలేదు. ఒక విద్యార్థి ఆశించిన అంశములన్నియు నేను కలిగియుంటిని; కాని నేను క్రీస్తు హెచ్చరించిన వానివలె నుంటిని, " ఒకడు సర్వలోకమును సంపాదించుకొని తన ఆత్మను పోగొట్టుకొనిన యెడల వానికేమి ప్రయోజనము?" ఆత్మీయ అంధకారము వలన మరియు దురదృష్టము వలన నా ఆరోగ్యము క్షీణించినది మరియు నా మనస్సు వ్యాకులము చెందినది. నా ఆత్మీయ పోరాటము ఒక భయంకర స్థితిలోనున్నది. నేను చాల కఠినముగా దేవునికి ఫిర్యాదు చేయుచుండెడివాడను: ఓ దేవా, నేను నా సహోదరసహోదరీలకంటె నిన్ను ఎక్కువగా ధ్యానము చేయుటలేదా? నీవు నాకెందుకీవిధంగా చేయుచున్నావు? నేను నిన్ను వెదకుటలేదా? కాని దేవుడు

ఎందుకు ఈ కష్టకాలములను అనుమతించెనో ఇప్పుడు నేను తెలిసికొను చున్నాను. దేవుని ప్రేమించువారికి సమస్తమును సమకూడి జరుగునన్న విషయము నిజము కాదా? నేను బైబిలు మరియు మత సంబంధమైన పుస్తకాలు చదువుట మానివేసి, ప్రార్థించుటలో ఆసక్తిని కోల్పోయితిని. నాకు ఈ లోకములో ఎన్ని లాభములు కలిగిననూ, స్వంత కృషితో మరియు జ్ఞానము లేక దాతృత్వ ముతో నన్నునేను పరిశుద్ధముగా మరియు నీతిగా ఉంచుకోగలిగిననూ, నాకు రక్షణ నిశ్చయత లేదు. నేను దేవునిచో అలసిపోయి చావును కోరుకొంటిని. నేను బాధతో, " అయ్యో, నేను మరల చిన్నబిడ్డగానుండి దేవుని గురించి పునరాలో చనచేసి ఉల్లాసముతో తపస్సునాచరించిననెంత బాగుండును!" అని మూల్గి యుంటిని. నేను మరుసటి జన్మలో ఒక చిన్నబిడ్డగా పుట్టునట్లు నా జీవితమును అంతముచేసికొంటె  బాగుండునని ఆలోచించుకొంటిని. హైందవ పునర్జన్మ సిద్ధాంతము నా ఆత్మహత్యకు ఒక హానికరమైన ప్రేరణగానుండెను. దేవునికి తప్ప ఎవరికి ప్రాణమును తీసే హక్కు లేదని నా తండ్రి చెప్పిన మాటలు గుర్తుకు వచ్చినప్పుడెల్లా నేను ఆత్మహత్య అంటే భయపడెడివాడను. దేవుని అదృశ్య హస్తము ఈ భయంకర పాపమునుండి నన్ను ఆపినదని ఇప్పుడు నాకు బాగుగా తెలియును. వైద్యులు నన్ను పరీక్షించి, " ఈ బాలుడు ఏ జబ్బువలన బాధ పడుటలేదు. అతడు బాగుగా తినవలెను." అని చెప్పిరి. నా తల్లి బోరున ఏడ్చి మరింత వైద్యము కొరకు నన్ను మద్రాసు తీసికొని వచ్చింది. ప్రభుత్వ వైద్య శాలలో నిపుణులైన వైద్యులచేత క్షుణ్ణంగా పరీక్షించబడితిని. వారు ఏ విధమైన రోగమును నాయందు కనుగొనలేదు. ఆధ్యాత్మిక చింతనయే నా అనారోగ్యము నకు కారణమని నాకు తెలియును. నా బంధువుడు వచ్చి ఒక రోజున నన్ను సువార్తకూటమునకు తీసికొని వెళ్ళెను. అక్కడ ప్రసంగించబడిన వర్తమానము ఏమనగా, " క్రీస్తు ఎటువంటి పాపమునుండియైననూ నిన్ను రక్షించగలడు. ఆయన తన రక్తాన్ని నీ పాపములకొరకు కార్చినాడు. ఆయన యొద్దకు రమ్ము. నీ పాపములన్నియు ఒప్పుకొనుము, ఆయన రక్తమునందు విశ్వాసముంచుము; ఆయన నీకు విశ్రాంతిని, ఆనందమును మరియు శాంతిని అనుగ్రహిస్తాడు."

చివరికి శాంతి:

ఇప్పటివరకు నేను నా జ్ఞానముమీద, స్వయం కృషిమీద ఆధారపడ్డాను. కాని

దేవుడు నా జీవితములో జరిగిన సంఘటనలవలన ఇవి శక్తిహీనములని చూపించెను. నా జీవితములో నమ్మదగిన విషయమేమియునూ లేదు. ఆయన నన్ను నిస్సహాయస్థితికి మరియు శూన్యమునకు నడిపించెను. మరియు నేను సువార్తకు ఏమియు అర్థము చెప్పలేకపోతిని. నేను ఒక చిన్న బిడ్డవలె సులభంగా నమ్మితిని. ఒక దైవజనుడు నూనెతో నా తల అంటి నా ఆరోగ్యము కొరకు క్రీస్తు నామమున ప్రార్థించెను. నేను కోల్పోయిన నా జ్ఞాపక శక్తి తిరిగి వచ్చి, నా బలహీన శరీరము బలపడెను. ఆత్మహత్యా ఆలోచనలు నాలోనుండి పోయినవి. నేను నా చదువును కొనసాగించలేనని అనుకొంటిని గాని దేవుడు విశ్వవిద్యాలయములో బి.ఎ. లో నేను అత్యుత్తమ శ్రేణిలో ఉత్తీర్ణుడనగునట్లు చేసెను. బైబిలు నాకు సజీవ గ్రంథముగానుండెను మరియు ప్రార్థనలో ఆసక్తి పెరిగెను. నూతన తలంపులు, నూతన ఆరోగ్యము, నూతన మనస్సు, నూతన హృదయము... నాలో ఉన్న ప్రతి విషయము నూతనపరచబడెను... నూతనం! నూతనం!! నూతనం!!! ఎందుకంటే నేను క్రీస్తులోనున్నాను, నేను ఒక నూతన సృష్టి నయ్యాను. పాతవన్నియు గతించిపోయినవి. ఇదిగో సమస్తమును క్రొత్తవాయెను. నా పాపభారము తీసివేయబడెను. ఎందుకనగా క్రీస్తు నా నీతియాయెను. నేను ఒక చిన్నబిడ్డవలెనుంటిని; నేను తిరిగి జన్మించితిని. పునర్జన్మచక్రము(వలయము) ప్రకారము నేను నా జీవితమును అంతము చేసికొననవసరములేదు. క్రీస్తు నన్ను తన రక్తములో కడిగి, లోకము ఇవ్వలేనటువంటి ఆనందము, విశ్రాంతి మరియు సమాధానము ఇచ్చినాడని నేను అత్యంత ధృఢముగా వెల్లడించగలను. రక్షణ ఎంతో గొప్పది. దానిని పొందుటకు ఎవరును ఏమియు చేయలేరని నేను ఇప్పుడు గ్రహించితిని. అది విలువ కట్ట లేనిది; అది పాపములు ఒప్పుకొనిన ప్రతివానికి, క్రీస్తు రక్తమునందు విశ్వాసముంచి, ఆయనను స్వంత రక్షకునిగా అంగీకరించిన ప్రతివారికి క్రీస్తుయేసు ద్వారా దేవుడు ఇచ్చిన వరము.

ఎం.జి.ఎస్.
సికింద్రాబాద్, ఇండియా.